క్లుప్తంగా

సాగు చేసిన పంటలను దున్నేస్తున్నారు



సాగు చేసిన మినుము పంటను దున్నేస్తున్న కౌలు రైతు

ఎర్రగుంట్ల : ఎంతో ఆశతో సాగు చేసిన మినుము పంటను రైతులు దున్నేస్తున్నారు. ఆదివారం ఎర్రగుంట్ల పట్టణంలో కొందరు రైతులు మినుము పంటను చాలా వరకు దున్నేశారు. మండల పరిధిలోని సుమారు 204 హెక్టార్లలో మినుము పంట, 106 హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వెంకటకృష్ణయ్య అనే కౌలు రైతు సుమారు 15 ఎకరాలలో మినుము పంటను సాగు చేసి వర్షం పడక పోవడంతో దున్నేశాడు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

పెండ్లిమర్రి : సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పురావడంతో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను కొనసాగించేలా పార్లమెంట్‌లో చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నయ్య, బాబు, రంగయ్యలు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను చేశారు. భక్తులు కానుకలను సమర్పించుకున్నారు.

నివాళి

పెండ్లిమర్రి : మండలంలోని నల్లయ్యగారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్దారెడ్డి తండ్రి శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిలు ఆదివారం ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యాక్షుడు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

పోరుమామిళ్ల : బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తామని మండల ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రైతులు సోమవారం నుంచి సంబంధిత రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం ఆయన మాట్లాడుతూ బిందు సేద్యానికి 5 ఎకరాల లోపున్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ. 2.18 లక్షల వరకు పరికరాలు అమర్చుకోవచ్చని తెలిపారు. 5 ఎకరాల పైబడి పొలమున్న రైతులకు 70 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. తుంపర్ల సేద్య పరికరాలకు 45 నుంచి 55 శాతం రాయితీతో పరికరాలు లభిస్తాయని వివరించారు. బిందు సేద్యం వలన తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చని, సాగునీరు వినియోగం, సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని, కరెంట్ ఆదా అవుతుందని ఆయన తెలిపారు. మొక్కకి కావాల్సిన నీరు, గాలి, పోషకాలు సమపాళ్లలో అందటం వలన మొక్క ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి ఇస్తుందని చెప్పారు. బిందువుల రూపంలో నీరు అందించుట వలన భూమిలో తేమశాతం సమపాళ్లలో ఉండి చీడపీడల దాడి అదుపులో ఉంటుందని తెలిపారు. రైతులు బిందు, తుంపర సేద్య పరికరాలతో సాగు చేయాలని శ్రీనివాసుల రెడ్డి సూచించారు.

కాషాయ జెండాలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయకుమార్ సర్కిల్ వద్ద ఆదివారం 300 ఆటోలకు జైశ్రీరాం కాషాయ జెండాలను అందించారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్త బృందం వ్యవస్థాపకుడు దశమందం బాబు మాట్లాడుతూ 300 ఆటోలకు వీఎల్ సురేంద్రనాథ్‌రెడ్డి, వాసవి ఆప్టికల్స్, దశమందం విద్యాసేవా సదన్ ఆధ్వర్యంలో 300 జెండాలను కట్టామన్నారు. ఇప్పటి వరకు 13,230 బైక్‌లకు, 800 పైగా ఆటోలకు కాషాయజెండాలను కట్టినట్లు తెలిపారు.

గోవుల కష్టాలు.. పట్టించుకునేవారేరీ..!

- గోవులను వదిలేస్తున్న యజమానులు
- ప్లాస్టిక్ వ్యర్థాలను తిని మృత్యువాత పడుతున్న వైనం



రోడ్లపై తిరుగుతున్న ఆవులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని గోవుల కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. గోవుల యజమానులు మాత్రం వాటిని రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో గోవులు రోడ్లపైన ప్లాస్టిక్ వ్యర్థాలు, సినిమా వాల్‌పోస్టర్లు తిని మృత్యువాత పడుతున్నాయి. వాటి యజమానులు కానీ, ఇటు సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. భారతదేశంలో గోమాతలో సకల దేవతలు కొలువై ఉంటారని హిందువుల నమ్మకం. గోవులను పూజిస్తే సకల దేవతలను పూజించిన పుణ్యం లభిస్తుందని పెద్దలు, పురాణాలు చెప్పడం వల్ల గోవులకు ఎంతో విశిష్టత ఉంది. ఆవుల పోషణ భారంగా మారడంతో కొందరు యజమానులు వాటిని రోడ్లపైకి వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని రోజుల తర్వాత అవి పిల్లలకు జన్మనిస్తే అప్పుడు మళ్లీ ఇంటికి తీసుకెళ్లి పాలు పిండుకుని మళ్లీ వదిలేస్తున్నారు. పులివెందుల పట్టణంలోని కడప రోడ్డు, ముద్దనూరురోడ్డు, పాత బస్టాండు, బీఎస్ఎన్ఎల్ కార్యాయలం, ప్రధాన రహదారుల్లో గుంపులు గుంపులుగా ఆవులు తిరుగుతున్నాయి. వీటికి రహదారులే పశువుల పాకగా మారుతున్నాయి. రోడ్డు పక్కన గుంతలో ఉన్న నీటితో దాహం తీర్చుకుంటున్నాయి. వీధుల్లోకి వెళ్లి ఇళ్ల దగ్గర ఆవు నిలబడితే బియ్యం, జొన్నలు, ధాన్యం వాటికి ఆహారంగా పెడుతున్నారు. పచ్చగడ్డి రుచి చూసే భాగ్యం వాటికి లేదు.

ప్రమాదాల భారిన పడుతున్న వాహనదారులు

రహదారులపై ఆవులు ఎక్కడపడితే అక్కడ పడుకుని ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారుల్లో రాత్రి సమయాల్లో గోవులు అడ్డంగా పడుకున్న సమయాల్లో ద్విచక్రవాహనదారులు అనేకమార్లు ప్రమాదాల భారిన పడ్డారు. అలాగే ఎద్దులు ఒకదానిపై ఒకటి దాడిచేసుకుంటూ వాహనాలపైకి, దుకాణాలపైకి దూసుకువస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు గోవుల యజమానులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు కోరుతున్నారు.

గోశాలలో వదిలేయండి



పట్టణంలో ప్రధాన రహదారుల్లో గోవులు రోడ్లపై తిరుగుతున్నాయి. వాటిని యజమానులు కూడా పట్టించుకోవడం లేదు. గోవులు విషపూరిత పదార్థాలు తిని ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నాయి. రోడ్లపై ఉన్న గోవులను అధికారులు స్పందించి గోశాలలో వదిలేయాలి.
– నాగమునెమ్మ, పులివెందుల

రోడ్లపై తిరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి



పులివెందుల మున్సిపాలిటీలో రోడ్లపైన గోవులు తిరుగుతుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాటి యజమానులు ఆవులను పట్టించుకోకపోవడంతో ఆవులు రోడ్లపై ఉన్న ప్లాస్టిక్ కవర్లు, వాల్‌పోస్టర్లకు ఉన్న మైదాను తింటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై ఆవులు తిరుగకుండా చర్యలు తీసుకోవాలి.
– నాగరాజు, పులివెందుల

గుంతల దారులతో ప్రయాణం నరకం



అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని మూలవంక నుంచి చింతకొమ్మదిన్నె మీదుగా వెల్లటూరుకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. అధికంగా టిప్పర్లు భారీ లోడ్లతో వెళ్లడంతో రోడ్లు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ప్రయాణికులు రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిన ప్రశాంతత

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మికతతో మానసిన ప్రశాంతత లభిస్తుందని తొగటవీర క్షత్రియ కుల గురువు దివ్యజ్ఞానానంద స్వామి పేర్కొన్నారు. స్థానిక ఆచార్ల కాలనీలోని భాష్యం పాఠశాలలో ఆదివారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పనుల వెనుక శక్తిస్వరూపిణి అమ్మవారి అనుగ్రహం ఉంటుందన్నారు. భగవంతున్ని చిత్తశుద్ధి, ఏకాగ్రతతో ప్రార్థించాలని కోరారు. భగవంతుని దర్శనం కోసం సంకల్పంతో ఉండాలని, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలను చదివి అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య, తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్యలు పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం



పూర్వవిద్యార్థులు

పులివెందుల టౌన్ : స్థానిక సత్రంబడి పాఠశాలలో 1983 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్నారు. ఆదివారం పూర్వవిద్యార్థులు అంతా ఒకచోట కలుసుకుని తమ మధురానుబూతులను నెమరేసుకున్నారు. స్నేహితుల దినోత్సవం రోజు ఇలా కలవడం ఎంతో ఆనందంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

జమ్మలమడుగు : స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక పీఆర్ హైస్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పూర్వపు విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరర్భంగా సభ్యులు పఠాన్ ఖాజా, మజహార్ ఆలీలు మాట్లాడుతూ గతంలో 10వ తరగతి చదువుకున్న స్నేహితులు ఎవరైన ఇబ్బందుల్లో ఉంటే తాము తమ వంతు సాయంగా సొసైటి తరపున చేస్తామన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి



ప్రైవేట్‌పాఠశాలల యాజమన్యాలతో మాట్లాడుతున్న ఎంఈఓలు

జమ్మలమడుగు : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఎంఈఓలు వెంకటరమణారెడ్డి, చంద్రశేఖర్ రావులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లతో స్థానిక మిఠాయిగిరి వీధిలో ఉన్న ఉర్దూ పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లోనే నోట్ పుస్తకాల అమ్మకాలు చేస్తున్నారన్నారు. పైగా అధిక రేట్లు వసూలు చేస్తున్నారంటూ విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫీజులు సైతం ఎక్కువగా వసూలు చేస్తున్నారన్నాయి. ప్రైవేట్‌పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫిజులు వసూలు చేయాలని సూచించారు. తాము పాఠశాలలను తనిఖీ చేసినప్పుడు పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన విరాట పర్వపఠనం



విరాటపర్వం పఠిస్తున్న వక్తలు



హాజరైన భక్తులు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీపద్మావతి సమేత వేంకటరమణస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విరాటపర్వ పఠనాన్ని భక్తిశ్రద్ధలతో చదివి వినిపించారు. సకాలంలో వర్షాలు కురవాలని గత నెల 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు విరాట పర్వ పఠనం నెలరోజులపాటు పులివెందుల శ్రీమద్భాగవత ధర్మప్రచార ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ విరాటపర్వ పఠనంలో పలువురు వక్తలు, వ్యాఖ్యాతలు పఠనం చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విరాట పర్వ పఠనం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సకాలంలో పండి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. ఆదివారం విరాట పర్వం పఠనాన్ని కెకె కొట్టాల సర్పంచ్ శ్రీరంగనాథ, శేషయ్యలు చదివి వినిపించారు. విరాటపర్వ పఠనం ముగియడంతో పలువురు వక్తలు, వ్యాఖ్యాతలు, ప్రముఖులను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుందూకు జలకళ

స్థానికంగా వర్షాలు కురవకపోయినా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగ వరద నీరు రావడంతో అక్కడ నుంచి దిగువకు నీరు వదులుతుండటంతో కుందూ నదిలో జలకళ సంతరించుకుంది. కుందూ నదికి భారీగ వరద నీరు వస్తుండటంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు వరి పంట సాగుకై సిద్ధం అవుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వర్షం లేక ఎండిపోతోన్న దశలో కుందూ నదికి నీరు రావడంతో పంటలకు ప్రాణం వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – పెద్దముడియం



నెమళ్లదిన్నె గ్రామం వద్ద ఉధృతంగా పారుతున్న కుందూ నది



సాగులో ఉన్న నారుమడి

చౌడేశ్వరీదేవి మాతకు 108 కలశాలతో జలాభిషేకం



వల్లూరు : 108 కలశాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న మహిళలు



జమ్మలమడుగులో బిందెసేవ కార్యక్రమంలో పాల్గొన్న కన్నెలూరు మహిళలు



వల్లూరు : చౌడేశ్వరీదేవి అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న మహిళలు



కొండాపురం : టి. కోడురులో జ్యోతుల ఉత్సవం



ఎర్రగుంట్లలో చౌడేశ్వరిదేవితల్లికి బోనాలను తీసుకుని వెళ్తున్న భక్తులు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో చౌడేశ్వరీమాత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాస బహుళ అమావాస్య దినాన అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ, పెద్దపుత్త గ్రామాలకు చెందిన మహిళలు తమ గృహాల నుంచి కలశ జలాన్ని తీసుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అర్చకుల పూజల అనంతరం మహిళలు 108 కలశాలలోని జలాలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అభిషేక జలాలను తీర్థంగా స్వీకరించారు. అనంతరం గ్రామంలోని నడివీధి గంగమ్మ వద్ద నుంచి మేళతాళాలతో మహిళలు బోనాలతో గ్రామోత్సవంగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రామరాజుపల్లెకు చెందిన సుధాకర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటాపురం వీవర్స్ కాలనీలోని చౌడేశ్వరీ మాత ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు

జమ్మలమడుగు : చౌడేశ్వరిదేవి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా నాగులకట్టలోని చౌడేశ్వరిదేవి, కన్నెలూరులోని ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా భక్తులు కోలాటం, నృత్యాలు చేశారు. రాత్రి బిందే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా జ్యోతుల గ్రామోత్సవం

కొండాపురం : మండలంలో టి.కోడూరు గ్రామంలో చౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా ఆదివారం వేకువజామునుంచే జ్యోతులు వైభవంగా నిర్వహించారు. జ్యోతులు పూరవీధుల వెంబడి గ్రామోత్సవంలో చౌడేశ్వరి ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తమ కష్టాలు తొలగిపోవాలని అమ్మవారికి భక్తులు ముక్కుబడి చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రాసాదాలను పంపిణీ చేశారు

ముద్దనూరు : చౌడేశ్వరిదేవి అమ్మవారు జన్మదిన వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని ఉప్పలూరు, బొందలకుంట, యామవరం తదితర గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నడివూరులోని పెద్దమ్మతల్లికి పూజలు చేసి అక్కడ నుంచి చలువ ముద్దలతో బోనాలను ఆలయంకు తీసుకెళ్లారు. వలసపల్లి గ్రామానికి చెందిన కోలాట బృందం నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.

చల్లని చూపుల చౌడమ్మ చల్లంగ చూడమ్మ

పులివెందుల టౌన్ : పట్టణంలోని మారుతీ హాల్‌రోడ్డులో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవంగ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి పల్లకి ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం పులివెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

బొజ్జాయిపల్లెలో ఆదివారం చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని ఆలయఅర్చకులు కుమారస్వామి అభిషేకాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వేంపల్లె : చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పిరమిడ్ నగర్‌లోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చౌడేశ్వరీమాతకు పూజలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరుతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ చౌడేశ్వరీదేవి జయంతి సందర్భంగా భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. చెన్నూరు పడమటి వీధిలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శాకంబరీదేవి అలంకారంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అల్లి శ్రీరామ్మూర్తి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



టి. కోడురులో ప్రత్యేకంగా అలంకరించిన చౌడేశ్వరిదేవి